వినాయకా.. వీడ్కోలు


వాకాడు: తూపిలిపాళెం బీచ్‌లో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు


ఓజిలి: నిమజ్జనానికి బయలుదేరిన బొజ్జగణపయ్య

చవితి వేడుకల సందర్భంగా వాడవాడలా కొలువైన గణపయ్యకు మూడోరోజు భక్తులు వీడ్కోలు పలికారు. వాకాడు మండలం తూపిలిపాళెం, లైట్‌హౌస్ బీచ్‌లో వినాయక విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేశారు. వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు 125 విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేశారు. దాదాపు 25 వేల మంది భక్తులు సముద్ర తీరంలో నిమజ్జన పూజలు చేసి భక్తి స్నానాలు ఆచరించారు. నాయుడుపేట పట్టణంలోని పలు విగ్రహాలు సముద్రంలో నిమజ్జనోత్సవానికి తరలివెళ్లాయి. పలు విగ్రహాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. పలు చోట్ల మహిళలకు ముగ్గుల పోటీలు పెట్టి బహుమతులిచ్చారు. కోట క్రాస్ రోడ్డులో వినాయకుని గ్రామోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓజిలి మండలంలో గ్రామాల్లో వినాయకుని విగ్రహాలకు పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు.

- వాకాడు/నాయుడుపేట టౌన్/కోట/ఓజిలి/రాపూరు


వాకాడు: లైట్‌హౌస్ బీచ్‌లో నిమజ్జనం చేస్తున్న భక్తులు


నాయుడుపేట: నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకుడు


రాపూరు: ఊరేగుతున్న గణపయ్య


వాకాడు: నిమజ్జనోత్సవంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


కోట: క్రాస్ రోడ్డులో వినాయకుని గ్రామోత్సవం

క్లుప్తంగా

మహిళా అధ్యక్షురాలిని కలిసిన రత్నశ్రీ


వరుదు కల్యాణి, కాకాణి పూజితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రత్నశ్రీ

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితను శుక్రవారం సూళ్లూరుపేట నియోజవర్గ మహిళ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మహిళ విభాగం జోనల్ సమావేశం నిర్వహించారు. దీనికి నియోజవర్గ మహిళ విభాగ కన్వీనర్ ఈదా రత్నశ్రీ హాజరై వారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

నిమజ్జన నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేటటౌన్: వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించే వాహనాలు నిబంధనలను పాటించాలని డీఎస్పీ జీ చెంచుబాబు శుక్రవారం సూచించారు. స్థానిక పోలీస్ డివిజన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, విగ్రహాలను వాహనాల్లో తరలించుకుని వెళ్లేటప్పుడు డ్రైవర్లు మద్యం తాగరాదని స్పష్టం చేశారు. భారీ విగ్రహాలను తరలించే సమయంలో చిన్నపిల్లలను విగ్రహాల పక్కన కూర్చో పెట్టరాదన్నారు. వాహనాల్లో అధిక సంఖ్యలో జనాలను తరలించడం ప్రమాదమేనన్నారు. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలను పాటించి వినాయకుని నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీతో పాటు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి సూచనలు చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓ

సైదాపురం: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఈఓ బాల సుబ్రమణ్యం పేర్కొన్నారు. మండలంలోని కలిచేడు మైకామైన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా పలు ఆటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బాల్య వివాహాలతో అనర్థాలు


మాట్లాడుతున్న అద్దంకి గాంధీ

వెంకటగిరి రూరల్: బాల్యవివాహాలు నిర్వహించడం వల్ల ఆరోగ్య పరమైన సమస్యలు ఎదురవుతాయని, ఇది చట్టరీత్యా నేరమని న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు అద్దంకి గాంధీ పేర్కొన్నారు. పట్టణంలోని 14వ వార్డులో శుక్రవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల పుట్టబోయే బిడ్డకూ సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. మహిళలను లైంగికంగా వేధిస్తే 20 ఏళ్లు జైలు శిక్ష/జీవిత ఖైదు శిక్షలు ఉంటాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో ఉండే ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాంబాబు, అనుపమ్మ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 35.199 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 35.199 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1150, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు 30-8-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	117
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	214
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	236
లేయర్ చికెన్	:	200

స్వామిత్వతో ఆస్తి ధ్రువీకరణ పత్రాలు


మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి

గూడూరురూరల్ : స్వామిత్వ కార్యక్రమం ద్వారా గ్రామ కంఠాల్లో ఉండే ఇళ్లకు ఆస్తి యాజమాన్య ధ్రువీకరణ పత్రాలను అందించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి తెలిపారు. గూడూరులోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం గూడూరు, చిల్లకూరు, కోట మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫేజ్-2 కింద జిల్లాలో 400 గ్రామాలు ఎంపికయ్యాయని, ఆరు నెలల్లో రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. 36 కాలమ్స్ ద్వారా వివరాలు సేకరించి ఆర్ఓఆర్ ద్వారా ధ్రువీకరణ పత్రాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. గూడూరు మండలంలో 13 రెవెన్యూ గ్రామాలు స్వామిత్వ సర్వేకు ఎంపికైనట్లు తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీ లోగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో గూడూరు ఎంపీడీఓ మధుసూదన్‌రావు, డిప్యూటీ ఎంపీడీఓ మోహన్, కోట ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణు, చిల్లకూరు ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసులు, స్వామిత్వ జిల్లా నోడల్ అధికారి ఎం.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ధ్యాన్‌చంద్‌కు నివాళి


ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

చిట్టమూరు: గునపాడు జెడ్పీహైస్కూల్లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని, తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్, తెలుగు భాష వాడుక ఉద్యమ నేత గిడుగు రామ్మూర్తి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అంతర్జాతీయ క్రీడాకారుడు లక్ష్మయ్యను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడాకారులకు నాయుడుపేట క్రీడా ఫౌండేషన్ వారి తరపున నగదు పురస్కారం అందజేశారు. క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ అథ్లెటిక్ క్రీడాకారుడు, పాఠశాల పీడీ పిడుగు భరత్ మహీపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట రూరల్ : ఎస్‌వీఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శంకర్ శర్మ ఆధ్వ ర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎస్‌బీకేఆర్‌లో జాతీయ క్రీడా దినోత్సవం

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

గరుడ వాహనంపై శ్రీవారి చిద్విలాసం


గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

రాపూరు: మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి శుక్రవారం రాత్రి బంగారు గరుడ వాహనంపై చిద్విలాసంతో భక్తులను కటాక్షించారు. శ్రీవారి జన్మ (స్వాతి)నక్షత్రం సందర్భంగా స్వామివారి మూలమూర్తిని చందనంతో అలంకరించారు. అనంతరం శాంతి హోమం, అన్నదానం చేశారు. రాత్రి శ్రీవారికి అత్యంత ప్రియమైన బంగారు గరుడ వాహనంపై ఉత్సవ విగ్రహాన్ని కొలువు తీర్చి కోన వీధుల్లో ఊరేగించారు. స్వామివారిని దర్శించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ మండల, మున్సిపల్ కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అందులో భాగంగా ప్రతి మండలానికి ఇద్దరు ఉపాధ్యక్షులు, ముగ్గురు జనరల్ సెక్రటరీలు, ఒక కోశాధికారి, ఐదుగురు కార్యదర్శులు, 15 మంది ఈసీ సభ్యులను నియమించారు.

గూడూరు మున్సిపాలిటీ ఉపాధ్యక్షులుగా దువ్వూరు విజయభాస్కరరెడ్డి, షేక్ సుబాన్, జనరల్ సెక్రటరీలుగా మనుబోలు రూపేష్‌రెడ్డి, కె ఎం పూర్ణచంద్ర, చింతల శ్రీనివాసులు, కోశాధికారిగా చేడిమాల సాయి క్రిష్ణను నియమించారు.

చిల్లకూరు: మండల ఉపాధ్యక్షులుగా జక్కంరెడ్డి మదుసూదన్‌రెడ్డి, రాజనేని వెంకటేశ్వర్లు నాయుడు, జనరల్ సెక్రటరీలుగా దారా మణి, కందలూరి మదన్‌మోహన్‌రెడ్డి, కోలంగారి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా నాటకం ప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చిట్టమూరు: మండల ఉపాధ్యక్షులుగా దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, వంకా చెంచయ్య, జనరల్ సెక్రటరీలుగా చిప్పల వెంకటయ్య, నాగముంతల సుబ్బయ్య, పేట రాజేష్ రెడ్డి, కోశాధికారిగా పులి రమేష్ ను నియమించారు

కోట: మండల ఉపాధ్యక్షులుగా కోటంబేటి సుబ్రమణ్యం, తన్నమాల కోటారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా పాముల సురేంద్ర, పాదర్తి మధుసూదన్‌రెడ్డి, పాపారెడ్డి శశిరెడ్డి, కోశాధికారిగా పుట్టా నారాయణను నియమించారు.

వాకాడు: మండల ఉపాధ్యక్షులుగా పామంజి రమణమ్మ, నల్లారెడ్డి మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా ఏనుగు పుష్ప, ఉడతా శ్రీనివాసులు, బందిలి వెంకటయ్య, కోశాధికారిగా వాకాటి జనార్దన రెడ్డి నియమితులయ్యారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం



సైదాపురం: వేషధారణల్లో విద్యార్థులు, చిల్లకూరు: విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సైదాపురం: మండలంలోని సైదాపురం, మర్లపూడి, తురిమెర్ల, అనంతమడుగు, గిద్దలూరు, కలిచేడు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గిడుగు వెంకటరామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఊటుకూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పలు వేషధారణలు వేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చిల్లకూరు: తెలుగు గడ్డపై పుట్టిన ప్రతి తెలుగు వాడు గిడుగు రామ్మూర్తి పంతులును ఎన్నటికి మరచి పోకూడదని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ప్రజేంద్రరెడ్డి అన్నారు. ఆ పాఠశాలలో తెలుగు, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. అనంతరం తెలుగు భాషపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

సంపద కేంద్రాలను వినియోగించుకోవాలి


బత్తలాపురంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ జాలిరెడ్డి

ఓజిలి: గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చెత్తసంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ జాలిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బత్తలాపురం, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో చెత్తసంపద కేంద్రం ద్వారా చెత్త తరలింపు ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ప్రజల వద్ద సేకరించిన చెత్తతో కేంద్రంలో ఎరువులు తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈయన వెంట ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ రేణుక, పంచాయతీ కార్యదర్శి వెంకయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

గూడూరురూరల్ : నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలని కోరుతూ శుక్రవారం గూడూరులోని ఎంఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు మోహన్‌దాస్, రవిచంద్ర పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసన

గూడూరురూరల్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఓటు దొంగ దిగిపో అంటూ శుక్రవారం గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నేతలు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందని దుయ్యబట్టారు. నిరసనలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి పూల చంద్రశేఖర్, గూడూరు నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రామకృష్ణారావు, బీసీ విభాగం నాయకులు సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర సంచుల పంపిణీ


వస్త్ర సంచులు అందుకున్న విద్యార్థులు

కోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండలంలోని కొత్తపాళెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ బాబు సూచించారు. శ్రీసీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు నేత వస్త్ర సంచులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల స్థానంలో వస్త్ర సంచులు వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలుగు అనర్థాలు వివరించారు. వస్త్ర సంచుల వాడకాన్ని ప్రోత్సహిస్తూ, వాటిని పంపిణీ చేస్తున్న సేవా సంస్థను అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణరావు, సేవాసంస్థ సభ్యులు దీవి అనంతాచార్యులు, సాయి, పరమేశ్వరి పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్‌పై రిలే దీక్ష

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట డిపోలో పని చేస్తున్న పద్మను అక్రమంగా సస్పెండ్ చేసినందుకు వ్యతిరేకంగా ఎన్ఎంయూ కార్మికులు శుక్రవారం డిపో సమీపంలో రిలే దీక్షలు కొనసాగించారు. ఎన్ఎంయూ సెక్రటరీ శేఖర్ మట్లాడుతూ జీవో నంబర్ 01-19 అమలు వల్ల ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి దాతల చేయూత


నగదు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అమరా గార్డెన్ వీధిలో నివాసం ఉంటున్న ఇందుకూరు హంసమ్మ (60)అనారోగ్యంతో మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో బలిజ చేయూత ఫౌండేషన్ వారు మృతురాలి ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి శుక్రవారం రూ.11 వేల నగదు అందించారు. మట్టి ఖర్చులకు కొంత నగదు సైతం అందించారు. ఆమె మృతి పట్ల ఫౌండేషన్‌కు చెందిన పగడాల శివ ప్రదీప్, హంసా పృథ్వీచంద్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఆక్వా గోడౌన్‌లో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కోట : స్థానిక బజారు వీధిలో వ్యాపారి శ్రీధర్‌రెడ్డికి చెందిన ఆక్వా గోడౌన్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బ్లీచింగ్ నిల్వ ఉంచిన గోడౌన్‌లో షాట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు బాధితుడు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. గోడౌన్‌లో ఉన్న 12 టన్నుల మేర బ్లీచింగ్, ఇన్‌వర్టర్ అగ్నికి ఆహుతైనట్లు వ్యాపారి తెలిపారు.

నది దాటాలంటే గండమే!


నది దాటడానికి ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు

సైదాపురం మండలంలోని పాలూరు -నిండలి మార్గంలో కైవల్యానదిని దాటాలంటే ప్రజలకు గండమే. నియోజకవర్గ కేంద్రం వెంకటగిరికి వెళ్లేందుకు ఈ మార్గం ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో వంతెనను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపారు. తరచుగా గంగ నీరు విడుదల చేసే సమయాల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఈమార్గంలో రాకపోకలు నిలిచిపోతాయి. ఈ ప్రాంత ప్రజలు సమీపంలో ఉన్న పంట పొలాలకు వెళ్లే మార్గం లేక ఇబ్బందులు పడుతుంటారు. అధికారులు స్పందించి ఈ మార్గంలో వంతెనను నిర్మించాల్సి ఉంది.

- సైదాపురం